క్లుప్తంగా

ఘనంగా దయాల్‌బాగ్ వర్సిటీ ఎడ్యుకేషన్ డే


విశాలాక్షినగర్‌లో దయాల్‌బాగ్ ఇన్‌స్టిట్యూట్‌లో ప్రార్థన చేస్తున్న సభ్యులు

ఆరిలోవ: విశాలాక్షినగర్ ప్రాంతం దయాల్‌నగర్‌లో దయాల్‌బాగ్ వర్సిటీ ఎడ్యుకేషనల్ డే ఆదివారం ఘనంగా నిర్వహించారు. దయాల్‌బాగ్ ఇన్‌స్టిట్యూట్ సభ్యులతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రార్థనలు చేశారు. అనంతరం కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విశ్రాంత ఆచార్యుడు పి.రామకృష్ణారావు మాట్లాడుతూ దయాల్‌బాగ్ వర్సిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న శిక్షణల గురించి వివరించారు. 2017 జనవరి 1న వర్సిటీ ప్రారంభం కావడంతో ప్రతి సంవత్సరం అదే రోజున ఎడ్యుకేషన్ డేగా జరుపుకొంటున్నామన్నారు. ఇక్కడ వృత్తిపరమైన కోర్సులు తక్కువ ఫీజులతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డ్రెస్ డిజైనింగ్, టైలరింగ్, టెక్స్‌టైల్స్, బ్లాక్ ప్రింట్, ఎంబ్రాయిడరింగ్, టై అండ్ డై కోర్సు, బైక్ మెకానిక్, ఎలక్ట్రికల్ వర్క్స్ తదితర కోర్సులు నేర్పుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్టిట్యూట్ ఇన్‌చార్జి దక్షిణమూర్తి, సభ్యులు, పలు కోర్సుల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు పాల్గొన్నారు.

టీబీ రోగుల నిధికి హెచ్‌ఎం సంఘం సహకారం


టీబీ రోగుల నిధి కోసం డీఈవో చంద్రకళకు విరాళం అందిస్తున్న హెచ్‌ఎంల సంఘం ప్రతినిధులు

ఆరిలోవ: జిల్లాలో ప్రధానోపాధ్యాయుల సంఘం ప్రతినిధులు డీఈవో ఎల్.చంద్రకళకు ఆదివారం వినూత్నంగా నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేశారు. బొకేలు, పండ్లు, స్వీట్లతో కాకుండా కొత్త సంవత్సరంలో కొత్తదనం చూపించారు. కలెక్టర్ మల్లికార్జున పిలుపు మేరకు టీబీ రోగుల నిధి కోసం జిల్లా హెచ్‌ఎంల సంఘం ప్రధాన కార్యదర్శి కె.కృష్ణకుమార్ ఆధ్వర్యంలో పలువురు హెచ్‌ఎంలు డీఈవో చంద్రకళను ఆమె చాంబరులో కలిసి రూ.5 వేలు చెక్కు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. వారిని డీఈవో అభినందించారు. ఈ కార్యక్రమంలో డీవైఈవో గౌరీశంకర్, పలువురు సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజా నాట్య మండలి రచయిత హష్మికి ఘన నివాళి


రవీంద్రనగర్‌లో హష్మికి నివాళులర్పిస్తున్న ప్రజా నాట్య మండలి సభ్యులు

ఆరిలోవ: ప్రజానాట్య మండలి ఆరిలోవ జోన్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ప్రజా నాట్య మండలి రచయిత హష్మి వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. జీవీఎంసీ 10వ వార్డు రవీంద్ర నగర్ కూడలిలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాట్యమండలి ప్రతినిధులు వై.అప్పారావు, లక్ష్మీసూర్యనారాయణ మాట్లాడుతూ హష్మి వీధి నాటకాన్ని ఆయుధంగా మలిచి పోరాటాలకు ఊపిరి పోశారన్నారు. కార్మిక హక్కుల కోసం జరుగుతున్న అనేక ఉద్యమాలలో కళారూపాలు ప్రదర్శించి ప్రజలను చైతన్యపరిచారని గుర్తు చేశారు. హష్మి బాటలోనే నట్య మండలి నడుస్తోందన్నారు. కార్యక్రమంలో నాట్యమడలి సభ్యులు రమణ, సన్యాసమ్మ, నాగరాజు, సీఐటీయూ నాయకులు కుమార్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

సాయినాథునికి 108 రకాల పిండి వంటలతో నైవేద్యం

పెదగంట్యాడ: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సమతానగర్‌లోని షిర్డీసాయి శాంతిధామంలో కొలువై ఉన్న సాయిబాబాకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకున్నారు. బాబాకు 108 రకాల పిండివంటలను నైవేద్యం సమర్పించారు.

ఉత్సాహంగా న్యూ ఇయర్ వేడుకలు


చినగదిలి సాయిబాబా ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


మేయర్ హరివెంకటకుమారికి శుభాకాంక్షలు తెలిపి సత్కరిస్తున్న జీవీఎంసీ యూనియన్ నాయకులు


అక్కరమాని విజయనిర్మలకు శుభాకాంక్షలు తెలుపుతున్న పలువురు మహిళ కార్యకర్తలు

- ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఆరిలోవ: నూతన సంవత్సరం ప్రారంభమైన సందర్భంగా తూర్పు నియోజకవర్గంలోని ఆలయాలు భక్తులతో కళకళలాడాయి. కొత్త సంవత్సరంలో అంతా మంచి జరిగాలని వేడుకున్నారు. ఆరిలోవ ప్రాంతంలో విఘ్నేశ్వర ఆలయాలు, వేంకటేశ్వర స్వామి, షిర్డీ సాయిబాబా, దుర్గాదేవి, ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఆరిలోవ ప్రాంతం, ఆదర్శనగర్, చినగదిలి, పెదగదిలి, విశాలాక్షి నగర్ ప్రాంతాలలో భక్తులు అభిషేకాలు చేసి, ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పుకొన్నారు. ఆలయాల్లో అర్చకులు భక్తుల గోత్ర నామాలతో పూజలు చేశారు. క్రైస్తవులు ఆయా ప్రాంతాల్లోని చర్చిలలో ప్రార్థనలు చేశారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో..

ఎంవీపీ కాలనీ: స్థానిక వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ కార్యాలయంలో వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్, తూర్పు సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల కేక్ కట్ చేసి అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలోని పలు వార్డుల నుంచి అధికారులు, కార్యకర్తలు, ముఖ్యనాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయనిర్మల దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

సందడిగా మేయర్ క్యాంప్ కార్యాలయం

ఆరిలోవ: మేయర్ క్యాంప్ కార్యాలయం ఆదివారం సందడిగా మారింది. నూతన సంవత్సరం మొదటి రోజు కావడంతో పెదగదిలిలో ఆమె కార్యాలయానికి ఆదివారం పలువురు కార్పొరేటర్లు, జీవీఎంసీ అధికారులు, సిబ్బంది, నగరంలో పలు వార్డుల నుంచి పార్టీలకు అతీతంగా నాయకులు, పలు యూనియన్ల సభ్యులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆమెను కలసి శుభాకాంక్షలు తెలియజేశారు. జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు, అదనపు కమిషనర్ సన్యాసిరావు, పీడీ శ్రీనివాసరావు తదితరులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపి గజమాలతో సత్కరించారు. జీవీఎంసీ, ఉపాధ్యాయ యూనియన్ నాయకులు పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేశారు. ఆరిలోవ ప్రాంతంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలియజేశారు.

వర్సిటీలో..

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నూతన సంవత్సర సందడి నెలకొంది. సోమవారం ఉదయం నుంచి ఏయూ పరిపాలన భవనం వద్దకు పెద్ద సంఖ్యలో ఉద్యోగులు చేరుకుని పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డికి రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఏయూ ప్రిన్సిపాల్స్, డీన్‌లు, అధికారులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ముక్కోటి ఏకాదశి.. ఉత్తర ద్వార దర్శన భాగ్యం


ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు

ఏయూ క్యాంపస్: పరమ పవిత్రంగా భావించే ముక్కోటి ఏకాదశికి ఆలయాలు ముస్తాబవుతున్నాయి. ప్రత్యేకంగా వేంకటేశ్వరస్వామి ఆలయాలలో ఉత్తర ద్వార దర్శనానికి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. 20వ వార్డు పెదవాల్తేరులోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం తెల్లవారు జాము నుంచి స్వామివారి ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు పూర్తి చేశారు.

- ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామివారు వటపత్రసాయి అలంకారంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఆలయ ప్రాంగణాన్ని పుష్పాలతో సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయ మండపం, గోపురాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉత్తరద్వారంలో స్వామివారు గజారోహణంలో దర్శనం ఇవ్వనున్నారు.
- భక్తుల రద్దీకి అనుగుణంగా అందరికీ సత్వర దర్శనం అందించేలా ఆలయ ఈవో ఆధ్వర్యంలో ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేశారు. సర్వ దర్శనంతో పాటు రూ.100 ప్రత్యేక దర్శనం క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఉదయం 4 గంటలకు ప్రదోశకాళ పూజ అనంతరం స్వామివారు ఉత్తర ద్వారంలో దర్శనమివ్వనున్నారు. సాయంత్రం 6 గంటల నుంచి ఆలయ మాడవీధులు, పురవీధుల్లో ఉత్సవ విగ్రహాల ఊరేగింపు కార్యక్రమం జరుగుతుందని ఆలయ ప్రధాన అర్చకుడు భోగాపురపు సూర్యనారాయణ తెలిపారు. క్తులకు పంపిణీ చేయడానికి ప్రత్యేకంగా 5 వేల లడ్డూలను సిద్ధం చేశారు.


విద్యుత్,పుష్పాలంకరణలో వేంకటేశ్వరస్వామి ఆలయం


పంపిణీకి సిద్ధం చేస్తున్న లడ్డూలు

‘భానుమతి పాట సీవీ రాజేశ్వరి నోట’ రేపు


సంగీత విభావరి పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: గాయనిగా, నటిగా ఖ్యాతి చెందిన ‘భానుమతి పాట.. సీవీ రాజేశ్వరి నోట’ శీర్షికతో మంగళవారం సినీ సంగీత విభావరి జరగనుంది. సంగీత దర్శకుడు ఏవీ కృష్ణారావు ఆధ్వర్యంలో జరగనున్న ఈ విభావరి పోస్టర్‌ను ఆదివారం ఉదయం ఏయూ వీసీ ప్రసాదరెడ్డి తన చాంబర్లో రిజిస్ట్రార్ వి.కృష్ణమోహన్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్యక్రమ సమన్వయకర్త శైలజా మెరాజ్ మాట్లాడుతూ ఈ నెల 3న సాయంత్రం 6 గంటలకు డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రం ఆడిటోరియంలో గాయని సీవీ రాజేశ్వరి మూడు గంటల పాటు నిర్విరామంగా భానుమతి పాటలు ఆలపిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో గాయని, ఏయూ అసిస్టెంట్ రిజిస్ట్రార్ సీవీ రాజేశ్వరి, ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు చెన్నా తిరుమలరావు, గాయకుడు సత్యానందం పాల్గొన్నారు.

చురుగ్గా పింఛన్ల పంపిణీ


జీవీఎంసీ 12వ వార్డులో డయాలసిస్ రోగికి రూ.10 వేలు పింఛన్ అందిస్తున్న కన్వీనర్, వలంటీర్లు

ఆరిలోవ: తూర్పు నియోజకవర్గంలో ఆదివారం పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. సచివాలయాల్లో ముగ్గురేసి కన్వీనర్లను ఇటీవల ప్రభుత్వం నియమించింది. ప్రతి సచివాలయంలో ముగ్గురు చొప్పున కన్వీనర్లు ఉన్నారు. ప్రతి కన్వీనరు వలంటీరుతో కలసి వెళ్లి లబ్ధిదారులకు పింఛను అందించాలి. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం నుంచి జీవీఎంసీ 9, 10, 11, 12, 13 వార్డుల్లో కన్వీనర్లు వలంటీర్లతో కలసి వెళ్లి డయాలసిస్ రోగులకు, వృద్ధులకు, దివ్యాంగులకు, వితంతువులకు పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఏమైనా సమస్యలు ఉంటే చెప్పాలని లబ్ధిదారులకు కన్వీనర్లు సూచించారు.

వెంకన్న ఆలయంలో క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్, చైర్మన్ తదితరులు

ఏయూ క్యాంపస్: జీవీఎంసీ 20వ వార్డు వేంకటేశ్వర స్వామి ఆలయంలో నూతన సంవత్సరం సందర్భంగా క్యాలెండర్‌ను కార్పొరేటర్ మువ్వల లక్ష్మి, ఆలయ చైర్‌పర్సన్ దాసరి పండరీభాయ్, ట్రస్ట్ బోర్డు సభ్యులు ఆవిష్కరించారు. వేంకటేశ్వరస్వామి చిత్రపటంతో కూడిన రెండు రకాల క్యాలెండర్లను ఆలయ ప్రధాన అర్చకులు బి.సూర్యనారాయణ ప్రత్యేకంగా తయారు చేయించారు. అనంతరం క్యాలెండర్లను భక్తులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో బి.శ్రీనివాస్, ట్రస్ట్ బోర్డు సభ్యులు రాచకొండ దశరథ రామయ్య, బల్ల మంగరాజు, మండెం పద్మజ, గుడ్ల సత్యనారాయణ, కాగితాల ప్రసాద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

‘అనంత సామర్థ్య సంపన్నుడు పేరి శ్రీనివాసరావు’


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: అనంత సామర్థ్య సంపన్నుడిగా ఆచార్య పేరి శ్రీనివాసరావు నిలుస్తున్నారని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. ఆదివారం వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో నిర్వహించిన ఆచార్య పేరి శ్రీనివాసరావు ఉద్యోగ విరమణ సత్కార సభలో ఆయన మాట్లాడారు. మూడున్నర దశాబ్దాలుగా ఆచార్య పేరి శ్రీనివాసరావుతో తనకున్న అనుబంధాన్ని, స్నేహాన్ని గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ప్రిన్సిపాల్స్ ఆచార్య కె.శ్రీనివాసరావు, వి.విజయలక్ష్మి, ఎస్.కె.భట్టి, విభాగాధిపతులు ఆచార్య కె.వెంకటరావు, ఆచార్య కుంజం నాగేశ్వరరావు, విజయానందరావు, ఇంజినీరింగ్ కళాశాల ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం పేరి శ్రీనివాసరావు దంపతులను సత్కరించి, జ్ఞాపిక బహూకరించారు.

అలరించిన ఆదివాసీ, జానపద నృత్యాలు



కళాకారుల నృత్య ప్రదర్శన

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం వేదికగా నిర్వహిస్తున్న సరస్ డ్వాక్రా బజార్‌లో ఆరో రోజు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆదివారం పెద్ద సంఖ్యలో సరస్‌కు నగర ప్రజలు విచ్చేశారు. చిన్నారులు సాంస్కృతిక నృత్యాలు, అభినయాలలో మంత్రముగ్ధులను చేశారు. విద్యార్థుల ఫ్లాష్‌మాబ్ ఆకట్టుకుంది. స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ చిన్నారులు ప్రదర్శించిన జానపద నృత్యాలు ఉర్రూతలూగించాయి. అక్తర్ ఇంద్రజాల ప్రదర్శన, వెంట్రిలాక్విజం కడుపుబ్బ నవ్వించింది. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా వేదికపై డీఆర్‌డీఏ పి.డి.శోభారాణి కేక్ కట్ చేసి చిన్నారులకు తినిపించారు.

పొడిబారిన కళ్లకు సకాలంలో చికిత్స అవసరం

ఎల్వీపీ కంటి వైద్యురాలు శిల్పా తరణి



ఆరిలోవ: పొడిబారిన కళ్లు మనిషి చూపును ప్రభావితం చేస్తాయని హనుమంతవాక వద్ద ఎల్.వి.ప్రసాద్ కంటి ఆస్పత్రి ఆప్తమాలజిస్టు డాక్టర్ శిల్పా తరణి ఆదివారం తెలిపారు. పొడిబారిన కళ్లతో కొద్ది రోజులుగా బాధపడుతున్న వారిని ఆమె పరీక్షించారు. ఈ సందర్భంగా ఆమె వారికి పలు సూచనలు చేశారు. కన్ను పొడిబారినవారు వెంటనే స్పందించి కంటి వైద్యులను సంప్రదించాలని సూచించారు. శీతాకాలంలో సాధారణంగా కన్ను పొడిబారి చూపు మందగిస్తుందన్నారు. మొబైల్ ఫోన్లు, కంప్యూటర్ స్క్రీన్ సుదీర్ఘంగా ఉపయోగించడం వల్ల ఎక్కువ మందిలో ఈ సమస్య తలెత్తుతుందన్నారు. కంప్యూటర్లు ఉపయోగించేవారు ప్రతి 20 నిమిషాలకు కొంత సేపు విరామం తీసుకోవాలని ఆమె సూచించారు.

ప్రత్యేక అలంకరణలో ప్రసన్న ఆంజనేయస్వామి


పండ్లతో అలంకరించిన స్వామివారు

ఎంవీపీ కాలనీ: స్థానిక సెక్టార్-6లోని వేంకటేశ్వర స్వామి, ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో నూతన సంవత్సరం సందర్భంగా ప్రసన్న ఆంజనేయస్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. వివిధ రకాల పండ్లు, పుచ్చకాయలు, జామ, దానిమ్మ, యాపిల్, కివి పండ్లతో పాటు బాదం, జీడి పప్పుతో అలంకరించారు. ప్రసన్న ఆంజనేయ స్వామితో పాటు శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు.

ఘనంగా ఓబీసీ ఉద్యోగుల ఆత్మీయ కలయిక


ఆత్మీయ కలయికలో పాల్గొన్న స్టీల్ ఓబీసీ నాయకులు, ఉద్యోగులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఓబీసీ ఉద్యోగుల ఆత్మీయ కలయిక ఆదివారం ఘనంగా జరిగింది. ఈనెల 7న జరగనున్న స్టీల్ ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఎన్నికల ప్రచారంలో భాగంగా నెహ్రూ పార్కులో మహాత్మా జ్యోతిరావు పూలే ప్యానల్‌కు చెందిన కార్యవర్గ సభ్యులు, విభాగాల సమన్వయకర్తలు, విభాగ కమిటీల ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఓబీసీ ఉద్యోగుల సంక్షేమార్థం ఐదేళ్లుగా తమ కార్యవర్గం పలు సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందన్నారు. రానున్న ఎన్నికల్లో తమ ప్యానల్ గెలిపిస్తే మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు. కార్యక్రమంలో అడహాక్ కమిటీ నాయకులు కోమటి రవిశంకర్, నక్క వెంకటరమణ, నెల్లి అప్పలరాజు, పిల్లి చంద్రరావు, నమ్మి తాతారావు, డాక్టర్ కాంబ్లే, కళ్యాణి, వి.ఎం. నాయుడు, నమ్మి సత్యనారాయణ, పి. గోవిందరాజులు, రాజమోహన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


జాతీయ రహదారిపై లారీని ఢీకొట్టిన కారు (ఇన్‌సెట్) మృతుడు సందీప్ (ఫైల్)

గోపాలపట్నం/కూర్మన్నపాలెం : రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. ఎయిర్‌పోర్టు సమీపంలో జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదానికి సంబంధించి ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వడ్లపూడికి చెందిన సందీప్ ఓలా డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. నలుగురు ఫ్రెండ్స్‌తో కలసి న్యూ ఇయర్ కావడంతో శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత బీచ్‌కు వెళ్లారు. తిరిగి ఉదయం 4 గంటల సమయంలో బయలుదేరారు. ఎయిర్‌పోర్టు జంక్షన్ దాటిన తర్వాత ముందు వెళ్తున్న లారీ కుడివైపు సిగ్నల్ లేకుండా తిరగడంతో వెనకకారులో వస్తున్న వారు అదుపు చేయలేక ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో వడ్ల పూడికి చెందిన సందీప్ (23) అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో ఉన్న మరో ముగ్గురు చిన్నచిన్న గాయాలతోబయటపడ్డారు.

కుటుంబంలో విషాదం: చిన్నతనం నుంచి కిరాణా దుకాణాల్లో పనిచేస్తూ..ఎలక్ట్రికల్ పనులు నేర్చుకుని భీమవరంలోని ఓలా ఎలక్ట్రికల్ వాహనాల కంపెనీలో చేరాడు. తండ్రి ఫార్మా కంపెనీలో చిరుద్యోగి. తల్లి ఆరోగ్యం కూడా అంతంతమాత్రంగా ఉంది. చేతికి అందొచ్చిన కొడుకు అర్ధంతరంగా తనువు చాలించడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో ధనుర్మాస పూజలు

సింహాచలం: ధనుర్మాసంతో పాటు నూతన సంవత్సరం కావడంతో ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఆదివారం వేకువ జాము నుంచే పూజలు ప్రారంభమయ్యాయి. సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో పగల్‌పత్తు ఉత్సవాల్లో సుప్రభాత సేవ, ఆరాధన అనంతరం స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను పల్లకిలో వేంచేయజేశారు.ఆలయ బేడా మండపంలో వైభవంగా తిరువీధి నిర్వహించారు. ధనుర్మాస పూజలు విశేషంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో గోదాదేవి తిరువీధి నిర్వహించి హారతులు అందజేశారు. స్థానాచార్యులు టి.పి. రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు ఈపూజలు నిర్వహించారు.

ప్రజాస్వామ్యానికి ఎన్నికలే పునాదులు


మాట్లాడుతున్న వి.వి.లక్ష్మీనారాయణ

సీతంపేట: ప్రజాస్వామ్య వ్యవస్థ పునాదులు పటిష్టంగా ఉండాలంటే ఎన్నికల వ్యవస్థ బలంగా ఉండాలని సీబీఐ మాజీ జేడీ వి.వి.లక్ష్మీనారాయణ అన్నారు. ‘ఎన్నికల సంస్కరణలు-కల నుంచి వాస్తవానికి’ అనే అంశంపై ద్వారకా నగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం జరిగిన అభిప్రాయ సేకరణలో ఆయన మాట్లాడారు. ఎన్నికలు మొక్కుబడి తంతుగా మారకూడదని, వాటికి నేరస్థులను దూరం చేయాలన్నారు. నాగార్జున యూనివర్సిటీ పూర్వ వీసీ ఆచార్య బాలమోహన్ దాస్ మాట్లాడుతూ ఎన్నికల్లో గెలిచిన వ్యక్తి కంటే నోటా ఓట్లు ఎక్కువ ఉంటే. ఆ ఎన్నిక రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఎన్నికలు ఒకేసారి జరగాలన్నారు. ఎవరైనా చనిపోయినా, పదవికి రాజీనామా చేసినా తర్వాత ఎక్కువ ఓట్లు సాధించిన వ్యక్తికి ఆ స్థానం ఇవ్వాలే తప్ప మళ్లీ ఎన్నిక నిర్వహించరాదన్నారు. ఎన్నికల సంస్కరణలకు సంబంధించి సుమారు 15 అంశాలపై పలువురు చర్చించారు. సమావేశంలో గ్రంథాలయ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.విజయ్‌కుమార్, డి.ఎస్. వర్మ పాల్గొన్నారు.

నూతనోత్తేజంతో ఉక్కు ఉద్యమం


దీక్షలో పాల్గొన్న సీఐటీయూ కాంట్రాక్ట్ కార్మికులు

కూర్మన్నపాలెం: నూతన సంవత్సరంలో నూతనోత్తేజంతో ఉక్కు అమ్మకానికి వ్యతిరేకంగా ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకువెళ్తామని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఈ మేరకు కూర్మన్నపాలెం కూడలి వద్ద 689వ రోజు జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్ష శిబిరం వద్ద స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కేక్ కట్ చేసి నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, పి.శ్రీనివాసరాజు, నమ్మి రమణ, జి.శ్రీనివాస్ , ఒప్పంద కార్మిక సంఘం ప్రతినిధులు నందికి తాతారావు, పిట్టా రెడ్డి, పి.నారాయణ, సన్యాసిరావు, పి.మహేష్, యు.సోమేష్, చట్టి నరసింగరావు, శ్యాంసుందర్, సిహెచ్. రాము, సింహాచలం, సోమినాయుడు, ఎస్.పైడిరాజు, వి.సోమేష్ పాల్గొన్నారు.